




ప్రాణం పదిలమేనా?

క్షణికావేశం.. తీరని శోకం..

- జిల్లాలో పెరుగుతున్న ఆత్మహత్యలు
- పది నెలల్లో 227 మంది బలవన్మరణం
- చిన్నచిన్న సమస్యలకే ప్రాణం తీసుకుంటున్నవైనం
- ప్రవర్తన పసిగడితేనే నివారణ సాధ్యం



బలమే జీవనం.. బలహీనతే మరణం.. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుంది.. పరిష్కారం లేని సమస్య అంటూ ఉండదు.. అని ఆలోచనాత్మక సూక్తులు చెప్పారు స్వామి వివేకానంద.. జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకోలేక చిన్న సమస్యలకే కుంగిపోయి ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కుటుంబ.. ఆర్థిక.. అనారోగ్య సమస్యలనో, లేక పరీక్ష తప్పామనో.. చదువు ఇష్టం లేక.. ప్రేమ విఫలమైందని.. ఇలా పలు కారణాలతో ఒత్తిడికి గురై బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందన్న విషయాన్ని మరుస్తున్నారు.

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత 2025 జనవరి నుంచి అక్టోబరు మాసం వరకు పది నెలల్లో 227 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 2023లో 224 మంది, 2024లో 250 మంది చొప్పున మూడేళ్లలో 700 మంది బలవన్మరణానికి పాల్పడినట్లు అధికారుల రికార్డుల ప్రకారం తెలుస్తున్నది. నిరక్షరాస్యతకు తోడు గిరిజన, ఆదివాసీ ప్రాబల్యం ఎక్కువగా ఉండడంతో పాటు రకరకాల పరిస్థితుల మధ్య పెరగడమే ఆత్మహత్యలకు దారితీస్తున్నదని మానసిక వైద్య నిపుణులు తెలుపుతున్నారు.

పది మాసాల్లో 227 మంది..

జిల్లా వ్యాప్తంగా 2025 జనవరి నుంచి అక్టోబరు 22 వరకు పది నెలల్లో 227 మంది వివిధ రకాల కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందులో 25 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు వారే అత్యధికంగా బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులు ఒక బాగమైతే, కుటుంబ సభ్యుల మధ్య తరచూ ఘర్షణలు, అక్రమ సంబంధాలు, అతిగా మద్యానికి బానిసవ్వడం, కుటుంబ సభ్యులు మందలించారని ఇలా పలురకాల కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

పురుగు మందులపై నిఘా కరువు

సేంద్రియ ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం రాష్ట్రంలోనే మహబూబాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నట్లు ఇటీవల వ్యవసాయ శాఖ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. విచ్చలవిడిగా పురుగు మందులు వాడడంతో పాటు వాటిని భద్రపర్చకుండ ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. దీంతో చిన్నచిన్న ఘర్షణలు, కుటుంబ సభ్యులు మందలించిన సమయంలో క్షణికావేశంతో అందుబా టులో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. దీనికితోడు ఫెర్టిలైజర్ దుకాణాల్లో పురుగుమందుల విక్రయాల్లో నిబంధనలు లేకపోవడమే ఆత్మహత్యలకు ప్రధాన కారణమని కొందరు మేధావులు విశ్లేశిస్తుడడం గమనార్హం.

ప్రవర్తన పసిగడితేనే..

ప్రవర్తన పసికడితేనే ఆత్మహత్యల నివారణ సాధ్యమని కొందరు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మహత్యల నివారణకు గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కలిపించాలి. ఫర్టిలైజర్ దుకాణాల్లో పురుగు మందుల విక్రయాలల్లో నిబంధనలు పాటించి, ఏ పంటకు ఎంత మందు పిచికారీ చేస్తున్నారనే పూర్తి వివరాలతో సరిపడేంత మాత్రమే పురుగు మందులు విక్రయించాలి. క్షణికావేశంతో నారాజుగా ఉన్న వారిని గుర్తించి సమన్వయంతో అవగాహన కల్పిస్తే ఆత్మహత్యల నివారణ సాధ్యమవుతుంది.


మహ-బాద్ పట్టణ శివారులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న క్రమంలో కాపాడిన పోలీసులు(ఫైల్)

పది నెలల్లో 227 మంది

వయస్సు	ఆత్మహత్యలు
14 ఏళ్ల లోపు	05
14 నుంచి 18 ..	23
19 నుంచి 30 ..	48
31 నుంచి 45 ..	84
46 నుంచి 60 ..	39
60 ఏళ్ల పైన	28
మొత్తం	227

ఆత్మహత్య ఘటనల్లో కొన్ని..

- ఏప్రిల్ 30న తొరూరు మండలంలోని మడిపెల్లి గ్రామానికి చెందిన 29 ఏళ్ల వివాహిత అప్పుల బాధతో ఆత్మహత్య.
- మే 6న నర్సింహులపేట మండల కేంద్రంలోని ఓ యువకుడు సమీప బంధువులతో గొడవ పెట్టుకొని ఫోన్‌లో మాట్లాడుతూనే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- మే 28న మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్ గ్రామంలో ఆస్తి తగాదాలో కుటుంబ సభ్యుల మధ్య చిన్న తగాదా రావడంతో ఓ 65 ఏళ్ల వృద్ధురాలు పురుగుల మందు తాగి మానుకోటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.
- జూన్ 5న పెద్దవంగర మండలం కొరిపెల్లి గ్రామంలో 18 సంవత్సరాల ఇంటర్మీడియట్ విద్యార్థి అనారోగ్యంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.
- జూలై 31న తొర్రూరు మండలంలోని నాంచారిమడూరు గ్రామానికి చెందిన 27 సవత్సరాల యువకుడు ప్రేమ విఫలమై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- సెప్టెంబరు 3న నర్సింహులపేట మండల కేంద్రంలో ఓ వృద్ధుడు కడుపునొప్పి భరించలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం
- సుధీర్ రాంనాథ్ కేకన్, ఎస్పీ

జిల్లా వ్యాప్తంగా ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఆగస్టు 8న జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరకాలకు చెందిన ఓ యువకుడు కటుంబ కలహాలతో మానుకోట పట్టణ శివారులో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకునేందుకు సిద్దపడగా ట్రాఫిక్ పోలీసులు రక్షించారు. ఈ మధ్య కాలంలో జిల్లాలో ఐదు ఘటనల్లో ఐదుగురిని కాపాడాం.గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. క్షణికావేశంలో నారాజుగా ఎవరైనా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.

ఎంజీఎంకు కొత్త బాస్

సూరింటెండెంట్‌గా డాక్టర్ పి.హరీష్ చంద్రారెడ్డి



వరంగల్ మెడికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పింగిళి హరీష్ చంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా మంగళవారం జీవోఆర్‌టీ నెంబర్ 506విడుదల చేశారు. ప్రస్తుతం హరీష్ చంద్రారెడ్డి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను ఎంజీఎం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కరీంగనగర్ జిల్లా హుజురాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన హరీష్ చంద్రారెడ్డి.. 1987-1993లో కాకతీయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1996లో హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో ఈఎన్‌టీ పీజీ పూర్తి చేశారు. కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారిగా విధులు నిర్వర్తించారు. 2002లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో ట్యూటర్‌గా పదోన్నతి పొందారు. 2003 నుంచి 2017 వరకు ఎంజీఎం ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించి, 2017లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. 2021

(మిగతా 8లో..)

ఈదురుగాలులకు నేలకొరిగిన వరి


చిన్ననాగారంలో నేలవాలిన వరి చూపుతున్న రైతు గుండ్ల వెంకన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని కేసముద్రం, ఇనుగుర్తి, కొత్తగూడతో పాటు ఇతర మండలాల్లో ఈదురుగాలులు వీస్తున్నాయి. బలమైన ఈదురుగాలల వల్ల ఇనుగుర్తి మండలంలోని చిన్న నాగారంలో గుండ్ల వెంకన్నకు చెందిన రెండెకరాల వరిపొలం నేలవాలింది. జిల్లాలో 88.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 5.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 5.2, గంగారంలో 8.2, బయ్యారంలో 6.8, గార్లలో 9.8, డోర్నకల్‌లో 6.2, కురవిలో 4.2, మహబూబాబాద్‌లో 7.6, గూడూరులో 4.8, కేసముద్రంలో 5.8, నెల్లికుదురులో 5.6, నర్సింహులపేటలో 7.0, చిన్నగూడూరులో 1.6, మరిపెడలో 2.8, దంతాలపల్లిలో 4.6, తొర్రూరులో 3.6, పెద్దవంగరలో 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వరికోతలు వాయిదా వేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా రైతులు వరి కోతలు వారం రోజుల పాటు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల కోరారు. మహబూబాబాద్‌లోని రైతు వేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆమె మాట్లాడారు. ఏఈవోల వద్ద పంటల నమోదు చేసుకోవాలని, పత్తి విక్రయించుకోవాలనుకుంటే ఏఈవోల వద్ద పంటలను నమోదు చేసుకుని కపాస్.. కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని సీసీఐకి అమ్ముకోవాలని చెప్పారు. పత్తి సాగు చేసిన కౌలు రైతులు సైతం ఏఈవోల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు ఏమైనా అనుమానాలు ఉంటే 18005995779 నెంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ రైతునేస్తం కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న, మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి, శాంతిప్రియదర్శిని పాల్గొన్నారు.


రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న విజయనిర్మల

డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలను సాగు చేయాలి

జిల్లా ఉద్యానవన శాఖాధికారి మరియన్న

కేసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు సంప్రదాయ పంటల స్థానంలో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉద్యానవన పంటలైన మునగ, కూరగాయలు, ఆకు కూరలు, పూలు, పండ్ల సాగును చేయాలని జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖా ధికారి జినుగు మరియన్న సూచించారు. కేసముద్రంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ఉద్యాన, పట్టు పరిశ్రమలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్, మునగ సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల ద్వారా ఎకరాకు లక్షన్నర ఆదాయం సంపాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పంటలను ఏఈవోల ద్వారా రైతుభరోసా పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ప్రతీ రైతు పొలం గట్లమీద, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటగా కూరగాయలు సాగు చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఎంఏవో బి.వెంకన్న, మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, సొసైటీ సీఈవో గోపాల మల్లారెడ్డి, ఏఈవోలు ధరావత్ రాజేందర్ ఉన్నారు.


కేసముద్రంలోని ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి మరియన్న

యాసంగి పంట బోనస్‌ను విడుదల చేయాలి



తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగికి వినతి పత్రాన్ని ఇస్తున్న ఏఐకెఎంఎస్ నాయకులు

దంతాలపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు యాసంగిలో ప్రభుత్వానికి ఇచ్చిన ధాన్యానికి వెంటనే బోనస్‌ను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వినతులతో కూడిన నివేదికను తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఏఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఊడుగుల లింగన్న మంగళవారం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతాంగం తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతాంగానికి మద్దతు ధరను ఇస్తూ ఆదుకోవాలన్నారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలను కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. అకాల వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు, ప్రభుత్వం సహాయక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో చిర్ర యాకన్న, వర్రె వెంకన్న, చిమ్ముల కమలాకర్, సంపత్, లక్ష్మి, రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సోమారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాడే మోస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు పాకనాటి సోమారెడ్డి (72) మృతి పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నవంగరలో సోమారెడ్డి భౌతిక కాయాన్ని పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోమారెడ్డి ప్రజల సమస్యలపై పట్టు సాధించిన గొప్ప నాయకుడని కొనియాడారు. అంత్యక్రియాల్లో పాడెమోశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రశర్మ, సునిల్‌రెడ్డి, శ్రీరాం సుధీర్, సంజయ్, సుధాకర్, వెంకన్న, రామక్రిష్ణరెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, శ్రీనివాస్, సోమనర్సయ్య, వెంకన్న, సోమన్న, భాస్కర్, పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.

ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి

తొర్రూరురూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముంచుకొస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తొర్రూరు తహసీల్దార్ గడీల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని అమ్మాపురం, సోమారం, గుర్తూర్, ఖానాపురం తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. మండలంలో ఇప్పటికే కొంతమంది రైతులు వరికోసి కేంద్రాల్లో పోశారని, వరి కోతకు వచ్చిన రైతులు కోయకుండా వర్షాలు తగ్గిన తరువాత కోసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడవకుండా అధికారులు టార్పాలిన్లు అందుబాటులో పెట్టాలని ఆదేశించారు. ఆర్.ఐ నజీముద్దీన్, పీఏసీఎస్ సీఈవో మురళి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

నెహ్రూసెంటర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ బుధవారం మహబూబాబాద్‌కు రానున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 1న హైదరాబాద్‌లో జరుగబోయే ప్రదర్శనలో మహబూబాబాద్ జిల్లా నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని విశ్రాంతిభవనంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశంలో పాల్గొంటారని చెప్పారు.

తానంచర్ల కేంద్రంగా ఇసుక రవాణా



తానంచర్ల పాలేరు వాగు నుంచి అక్రమంగా రవాణా అవుతున్న ఇసుక

మరిపెడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తానంచర్ల రెవెన్యూ పరిధిలోని పాలేరు వాగు నుంచి నిత్యం వందల ట్రిప్పుల ఇసుక అక్రమంగా రవాణా అవుతున్న అధికారులకు గింత పట్టిం పులేదని అక్కడి రైతులు వాపోతున్నారు. తెల్లారేసరికి వాగుకు వందల సంఖ్యలో ఇసుక కోసం ట్రాక్టర్లు వచ్చాయని అధికారులకు సమాచారం ఇచ్చిన అంతా మామూలుగానే చూస్తున్నారని అక్కడి రైతులు అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. వేల ట్రిప్పుల ఇసుకను తోడేయడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని గుండెలు బాదుకుంటున్నారు. మూల మర్రితండా జీపీ పరిధిలోని పాలేరు వాగు నుంచి ఇటు మహబూబాబాద్ జిల్లాకు చెందిన ట్రాక్టర్లు, అటు ఖమ్మం జిల్లా పరిధిలోని ట్రాక్టర్లు నిత్యం అక్రమంగా ఇసుకను పట్టణాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి ఎవ్వరికి ముట్టచెప్పేటేవి వాళ్లకే ముట్టచెప్పడంతో అక్రమ ఇసుక రవాణకు బ్రేక్లేవు అని అన్న దాతలు మండిపడుతున్నారు.ఈ ఏడాది అధిక వర్షాలు, అదునుకు యూరియా లభించక రైతులు దిగుబడి తగ్గి బోరున విలపిస్తున్నారు. రబీపై కోటి ఆశలతో ఉన్న అన్నదాతలకు అక్రమ ఇసుక రవాణతో భూ గర్భ జలాలు అడుగంటి పోతాయని భయం పట్టుకుంది. ఇప్పటికైనా అధికారులు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయకపోతే రైతుల పరిస్థితి గడ్డు కాలమేనని కన్నీటి పర్యాంతం చెందుతున్నారు.

ఎంబీఏ విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత



ఎంబీఏ విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ యాజమాన్యం, ఉపాధ్యాయులు

దంతాలపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన నిరుపేద, స్థానిక యూపీఎస్ పూర్వ విద్యార్థిని కలువల దినీషాకు బీవీవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయాన్ని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జలగం నరేందర్ మాట్లాడుతూ ఇటీవల గ్రామానికి చెందిన పేద విద్యార్థిని దినీషాకు ఎంబీఏ లో సీటు సాధించిందని, సొసైటీవారు రూ.5వేలు నగదును ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా బొడ్లాడ పాఠశా ల ఉపాధ్యాయ బృందం బీవీవీ చారిటబుల్ ట్రస్ట్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

పెద్దవంగర, అక్టోబర్ 28: (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐకేపీ సిబ్బంది, పీఏసీఎస్, వ్యవసాయాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎటువంటి జాప్యం లేకుండా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ధ్యానానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. ప్రతి తూకము కచ్చితంగా ఎలక్ట్రానిక్ మిషన్ల ద్వారానే కొనుగోలు చేయాలని, అందుకుగాను ప్రతి సెంటర్ వద్ద ఎలక్ట్రానిక్ మిషన్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి సెంటర్ వద్ద అధికారుల ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. దళారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తే కేసులు నమోదు చేయడంతోపాటు ఐకేపీ సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో వేణుమాదవ్, ఏవో గుగులోతు స్వామినాయక్, ఏఎస్సై హిదాయత్ అలీ, ఏపీఎం పాషా, ఆర్.లష్కర్, ఐకేపీ సిబ్బంది, ఏఈవోలు, సెంటర్ ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న మహబూబాబాద్ సీసీఎస్ డీఎస్పీ మోహన్

మరిపెడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడా పోటీలతో ప్రతి ఒక్కరికీ మానసికోల్లాసం లభిస్తుందని మహబూబాబాద్ సీసీఎస్ డీఎస్పీ మోహన్ అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా మంగళవారం మరిపెడ బంగ్లాలోని ఆడిటోరియం కం ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి పోలీస్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను మరిపెడ పోలీసులు నిర్వహించగా ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఎస్పీ మోహన్ మాట్లాడారు. పోలీసులకు ప్రజల మధ్య సత్సంబంధాలను మెరుగు పర్చుకోవడానికి పోలీస్, సివిలియన్స్ మధ్య స్నేహ భావం పెంపొందించడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే ప్రతి ఒక్కరూ తమ క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి, మెరుగైన మెళుకకువలు పెంచుకోవాలని సూచించారు. ఈ పోటీల సందర్భంగా ఆయన స్థానిక పోలీసులతో కలిసి షటిల్ బాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో స్థానిక సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్, అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు, సీరోల్ ఎస్సై సంతోశ్, చిన్నగూడూరు ఎస్సై ప్రవీణ్, జిల్లాలోని పలువురు పోలీస్ సిబ్బంది, స్థానిక యువకులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ



పాఠశాలకు ఫ్యాన్లను బహూకరిస్తున్న ఉపాధ్యాయుడు సురేందర్ గుప్తా

దంతాలపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఆంగ్లభాష బోధించే ప్రభుత్వ ఉపాధ్యాయుడు సురేందర్ గుప్తా తన తల్లి జ్ఞాపకార్థకంగా ఫ్యాన్లను బహూకరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధానోపాధ్యాయుడు పల్లా వేణుమాధవ్ రెడ్డి మాట్లాడుతూ సురేందర్ గుప్తా పాఠశాలకు రూ.14వేల విలు వ గల ఫ్యాన్లు అందించడం హర్షణీయమన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకొని పాఠశాలలకు తమకు నచ్చిన విధంగా సాయంచేయాలని కోరారు. నేటి సమాజంలో సమాజ సేవా దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సురేందర్ గుప్తాను పాఠశాల బృందం ఘనంగా సన్మానించింది.కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ ఎస్సైగా వీరభద్రరావు



మరిపెడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ ఎస్సైగా ఈ.వీరభద్రరావు మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్‌ను మహబూబాబాద్ ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. వరంగల్ కమిషనరేట్ పరిధి కమలాపూర్ ఎస్సైగా పనిచేస్తున్న వీరభద్రరావు మరిపెడకు బదిలీపై వచ్చారు. నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆయనను స్థానిక పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతలపై అందరు సహకరించాలని కోరారు.



గూడూరులో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అబ్దుల్‌కలాం వాకర్స్ అసోసియేషన్

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

● గూడూరు సీఐ సూర్యప్రకాష్


గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని గూడూరు సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గూడూరు మండల కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సీఐ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ పోలీస్ సమాజ సేవలో నిబద్ధతతో ముందుకు సాగి ప్రజల్లో సామాజిక బాధ్యత, దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించాలన్నారు. సిబ్బంది విధి నిర్వహణతో పాటు తమ దైనందిక జీవితంలో ఏదో ఒక వ్యాయామం అలవాటు చేసుకోవాలని చెప్పారు. అనంతరం సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు సీఐ, ఎస్సై పండ్ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై బిచ్చానాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● అబ్దుల్ కలాం వాకర్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ..

గూడూరు మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసులు సమాజ శ్రేయస్సు కోసమే పనిచేస్తున్నారన్నారు.

కార్యక్రమంలో మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ ఖాసీం, అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముయ్యబోయిన వెంకన్న, ముక్తవరం సత్యనా రాయణ, వాంకుడోతు కొమ్మాలు, గోపినాథ్, కన్న వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీనివాస్, పెద్ది మల్లేష్, మండల వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, ఈసం రమేష్, మహేష్, వీరన్న, సంగెపు స్వామి పాల్గొన్నారు.

గుమ్మిదారుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ను సన్మానిస్తున్న సీపీఐ నేతలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ దేవాలయం వద్ద ఉన్న గుమ్మి దారుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారధి, మాజీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారధిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో శుక్రవారం సీపీఐ ప్రతినిధి బృందం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గత 30 ఏళ్లగా కన్యకాపరమేశ్వరీ దేవాలయం సమీపంలో గుమ్మిలను ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని ఇటీవల కాలంలో మునిసిపల్ అధికారులు తొలగించారని చెప్పారు. గుమ్మిలు తొలగించడంతో గుమ్మిదారులు ఆందోళన చెందుతున్నారని వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం మానుకోట మునిసిపాలిటీకి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఒప్పించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు రూ.59.62 కోట్లు నిధులు మంజూరీ చేయించిన ఎమ్మెల్యే మురళీనాయక్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ నిధులతో మానుకోట పట్టణం మరింత అభివృద్ధి చెందనుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెళ్లి రవి, చిదిరాల జ్ఞానేశ్వర్, ఎమ్డీ. మహమూద్, జలగం ప్రవీణ్, కూరాకుల పాల్, గాదె శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

కేజీకేఎస్ మహాసభను జయప్రదం చేయాలి



మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేజీకేఎస్ నేతలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలో నవంబరు 14న జరుపతలపెట్టిన కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాధం భవన్‌లో మంగళవారం కేజీకేఎస్ జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌని వెంకన్న మాట్లాడుతూ....గీత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గీత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌కు ఎలాంటి షరతులు లేకుండా 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభలకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు హాజరవుతారని ఇందులో గత పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యచరణను రూపొందించనున్నట్లు వివరించారు. గీత కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యమగాని వవెంకన్న, మోడం వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, వెంకన్న, వీరస్వామి, సత్యనారాయణ, యాకన్న, అంజయ్య, సోమయ్య, యాకయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం



మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న రైతు బాంజి

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం నుంచి పత్తి కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పత్తి కొనుగోళ్లను వ్యాపారులు, మార్కెట్ అధికారులు కలిసి రైతు బాంజీ చేత కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పత్తి క్వింటాలుకు గరిష్ట ధర రూ.6930 పలుకగా, కనిష్ట ధర రూ.3509 పలికింది. సగటున రూ.6500 ధర పలికింది. మొదటిరోజు 611 బస్తాల పత్తి అమ్మకానికి వచ్చింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి సుజన్‌బాబు, వ్యాపారులు రాజేష్, ఇనాని, తల్లాడ రాంమ్మూర్తి, గిరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూసెంటర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఈసీజీ పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ పొందడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్ తెలిపారు. ఈ నెల 28 నుంచి నవంబర్ 27 వరకు గడువును పొడిగించినట్లు చెప్పారు. అడ్మిషన్ పొందాలనుకునే వారు ప్రభుత్వ వైద్య కళాశాల మహబూ బాబాద్‌లో నవంబర్ 27న సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలను స్వీయ ధృవీకరణతో రెండు పాస్‌ఫోటోను జతజేసి రూ.100 రుసుముతో ప్రభుత్వ వైద్య కళాశాలలో అందించాలన్నారు. www.tgpmb.telangana.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారం పొందవచ్చన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



మార్కెట్ సమీపంలో తనిఖీ చేస్తున్న అధికారులు

నెహ్రూసెంటర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు రవాణాశాఖ నిబంధనలు పాటించని వాహనాలను తనిఖీలు చేసి సీజ్ చేస్తున్నట్లు మహబూబాబాద్ మోటర్‌వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు సాయిచరణ్, వెంకట్‌రెడ్డిలు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇల్లందు రోడ్‌లో మార్కెట్ వద్ద మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఒక లారీ, మూడు ట్రాక్టర్లు పట్టుబడినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలను అతిక్రమిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు నడిపే డ్రైవర్లు సీట్ బెల్టును తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. కాలం చెల్లిన, తుప్పుపట్టిన వాహనాలను నడపవద్దన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీడీవోలు

మహబూబాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నూతనంగా గ్రూప్-1 ద్వారా ఎంపికైన ఎంపీడీవోలు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. గ్రూప్-1 ద్వారా ఎంపీడీవోలుగా ఎంపికై బాధ్యతలు స్వీకరించిన మహబూబాబాద్ మండల ఎంపీడీవో డి.సుస్మిత, చిన్నగూడూరు ఎంపీడీవో ఎం.సుజాత, నర్సింహులపేట ఎంపీడీవో వై. అంజలి, గంగారం ఎంపీడీవో డి. వైష్ణవి, బయ్యారం ఎంపీడీవో డి. దీపిక మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి పూల మొక్కను అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో అమలు, అభివృద్ధిలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో) ముఖ్య భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో పురుషోత్తం పాల్గొన్నారు.



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న నూతన ఎంపీడీవోలు

ఇంకెన్నాళ్లు ఈ పడవ ప్రయాణం?

- వ్యవసాయం చేయాలంటే ఇలా అర చేతిలో ప్రాణం పెట్టుకోని వెళ్లాల్సిందే మరీ..
- అదుపు తప్పితే ప్రమాదమే...
- ఎనభై ఏళ్లుగా నరకం అనుభవిస్తున్న రైతులు
- ప్రభుత్వాలు మారినా పట్టించుకోని పాలకులు

దంతాలపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ వాగు సమీపాన శివారు పల్లె ఉంది. అపల్లె వాసులు పడరాని పాట్లు పడుతూ నిత్యం అరచేతిలో ప్రాణం పెట్టి కాలం వెళ్లదీస్తున్నారు. స్వాంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారినా ఈ రైతన్నల కన్నీటి గాథ వినే నాథుడే కరువయ్యారు. ఎక్కడో మహా అడవిలో ఉండే ప్రజల బాధల కంటే.. వీరి వ్యథ వినలేనిది. చూడరానిది. వివరాల్లోకి వెళ్లితే..

మహబూబాబాద్‌లోని దంతాలపల్లి మండలం ఉమ్మడి ఆగపేట శివారు నూతనంగా ఏర్పడ్డ రామవరం గ్రామ పంచాయతీ. గ్రామాల పునర్విభజనలో భాగంగా ఏర్పడ్డ రామవరంలో 170 కుటుంబాలున్నాయి. ఇక్కడ వివిధ కులస్తులుంటారు. వీరి వృత్తి ముఖ్యంగా వ్యవసాయం పైనే ఆధారపడి ఉంది. వీరు 1930లో మండలంలోని పెద్దముప్పారం గ్రామం నుంచి వలస వచ్చినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ గ్రామం సమీపంలో ప్రసిద్ధి చెందిన పాలేరు వాగు ఉంది. ఈ వాగు ఇరువైపులా సుమారు 120 మంది రైతులకు 230 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. సాగుకోసం ప్రతీ వర్షాకాలం సమయంలో పాలేరు వాగు ప్రవహించే సమయంలో వాగు వెంబడి రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొందరు వాగు దాటేందుకు పడవ సహాయం, తెప్ప సహాయంతో వివిధ పనులకు వెళ్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మరీ భాగా వర్షాలు వచ్చినప్పుడు వారాల కొద్ది పొలాలను వదిలేసి ఊర్లోనే ఉంటారు. ఈ వాగు దాటేందుకు ఉపయోగిస్తున్న తెప్ప, పడవలు ఒడ్డు దాటే



ప్రమాదకరంగా ప్రవహిస్తున్న పాలేరు వాగును తెప్ప సహాయంతో దాటుతున్న మహిళా రైతు పగిడిపల్లి ధనమ్మ, రైతు పగిడిపల్లి బాబు

క్రమంలో అదమరిస్తే ప్రమాదం పొంచి ఉంది. సుమారు ఈ పాలేరు వాగు అర కిలో మీటర్ల దూరం పొడువునా ఉండడంతో రైతులు గుంపులు గుంపులుగా ఒకరి చేతులు మరొకరు పట్టుకుంటూ లోతైన వాగు గుండా వ్యవసాయ పనులకు వెళ్తుతున్నారు. ఇలా పలుమార్లు భారీ వర్షం సమయంలో ప్రమాదంలో ఓ యువకుడు 2015లో మృతి చెందాడు. 10 పశువులు సైతం నీటిలో కొట్టుకుపోయాయి. గతంలో పాలేరు ఉధృతికి ట్రాక్టర్లు, రైతులకు సంబంధించిన పరికరాలు సైతం వాగులో కొట్టుకోపోయాయి. ఈ గ్రామ ప్రజలు మండలంలోని పెద్దముప్పారం గ్రామాలకు వెళ్లాలంటే ఆగపేట శివారులోని తండాల నుంచి 7కిలో మీటర్ల దూరం గుండా ప్రయాణం చేయాలి. పాలేరు వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే కేవలం ఒక కిలో మీటరు దూరంతోనే పెద్దముప్పారానికి 40 కిలోమీటర్లలో సూర్యాపేటకు చేరుకోవచ్చు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేదని పేర్కొంటున్నారు రామవరం పల్లెవాసులు. ప్రభుత్వాలు మారుతన్నా వీరి బతుకుల్లో వెలుగు లేక రైతన్నలు పడరాని పాట్లు పడుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేయాలి



రామవరం ప్రజలకు బ్రిడ్జిలేకపోవడంతోనే పలుమార్లు మృత్యువాత సంభవించాయి. నాయకులు పట్టించుకోకపోవడంతోనే తాము వ్యవసాయానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో చాలా మంది తెప్పతో వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. గ్రామానికి చెందిన పొడుపుగంటి వెంకటయ్య, బొల్ల శ్రీనివాస్‌లు నీటి ప్రవాహానికి కొట్టుకోపాయారు. పొలం పనులకు వెళ్లాలంటే తెప్పలు, చిన్న చిన్న నాటు పడవలు ఉపయోగిస్తున్నాం. నాయకులు, అధికారులు స్పందించాలి. ప్రస్తుత ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చినా కల సాకారం కలేదన్నారు.

- మాలోతు హరిశ్చందర్‌నాయక్, రైతు, దుబ్బతండా శివారు, రామవరం

ఎన్‌పీడీసీఎల్‌కు ప్రతిష్ఠాత్మకమైన సర్టిఫికెట్లు



డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదిగా సర్టిఫికెట్ అందుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీడీసీఎల్‌కు ప్రతిష్టాత్మకమైన రెండు అత్యుత్తమైన ఐఎస్‌వో సర్టిఫికెట్లు లభించాయి. మంగళవారం ఖమ్మంలోని మధిరలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా సీఎండీ వరుణ్‌రెడ్డి సర్టిఫికెట్లను అందుకున్నారు. విద్యుత్ పంపిణీ కార్యక్రమాలు, సబ్‌స్టేషన్‌ల నిర్వహణ, సబ్‌స్టేషన్‌ల నిర్మాణాల్లో అత్యుత్తమ నాణ్యతను గుర్తిస్తూ క్యాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సర్టిఫికెట్లు ప్రదానం చేయగా, ఉద్యోగుల భద్రతపై అనునిత్యం తీసుకుంటున్న చర్యలకుగాను సంస్థ అనుసరిస్తున్న సురక్షా ప్రమాణాలను గుర్తిస్తూ ఆక్యూపేషనల్, హెల్త్‌అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ ప్రతిష్టాకమైన సర్టిఫికెట్ల ను హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ జారీ చేసింది. తెలంగాణలో మొదటిసారిగా ఐఎస్‌వో సర్టిఫికెట్‌లను ఎన్‌పీడీసీఎల్ పొందడం గర్వకారణంగా ఉందని సీఎండీ వరుణ్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

సామాజిక తెలంగాణే లక్ష్యం



ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాగృతి నేతలు

- తెలంగాణ జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవి
- నవంబరు 8, 9న వరంగల్ జిల్లాలో 'జాగృతి జనం బాట'

వడ్డెపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సామాజిక తెలంగాణే తమ లక్ష్యమని తెలంగాణ జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మారేపల్లి మాధవి అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చారిత్రక నేపథ్యం కలిగిన వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్ కోట, భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయాలను కల్వకుంట్ల కవిత సందర్శించనున్నట్లు వెల్లడించారు. వరంగల్ జిల్లాలో నవంబరు 8, 9న నిర్వహించే జాగృతి జనం బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు మాట్లాడుతూ.. వరంగల్, హనుమకొండ జిల్లాలోని మేధావులు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజనీర్లు, జర్నలిస్టులతో పాటు వివిధ కుల సంఘాల నాయకులను కల్వకుంట్ల కవిత కలిసి జనం బాటలో మమేకం కావాలని కోరినట్లు చెప్పారు.

జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీకాంత్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనేందుకే తెలంగాణ జాగృతి ఆవిర్భవించిందని పేర్కొన్నారు. జాగృతి జనం బాటకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాగృతి నేతలు కూతాడి కుమారస్వామి, ఓని సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా ఎంపిక పోటీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500మంది హాజరు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్-19 ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-19 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలు రెండో రోజు జోరుగా ప్రారంభమయ్యాయి. మంగళవారం జేఎన్‌ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలను ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి నరెడ్ల శ్రీధర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .నాలుగు రోజులు క్రీడా పోటీల నిర్వహణలో భాగంగా రెండోరోజు హ్యాండ్‌బాల్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, హాకీ, బెల్ట్, రెజ్లింగ్, సైక్లింగ్, స్కేటింగ్, బేస్‌బాల్, బీచ్ వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీల ను నిర్వహించగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500మంది క్రీడా కారులు పాల్గొన్నరన్నారు. కాగా, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చెస్, ములుగు రోడ్డులోని ఎల్బీ కళాశాల క్రీడా మైదానంలో షటిల్ బ్యాడ్మింటన్, వరంగల్ సీకేఎం కళాశాల మైదానంలో సైక్లింగ్ పోటీలను నిర్వహించామన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఎంపిక పోటీల్లో పలు జిల్లాల నుంచి బాలబాలికలు హాజరై గెలుపే లక్ష్యంగా లక్ష్యసాధన కోసం చమటోడ్చుతున్నారు. ఈ కార్యక్ర మంలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (ఎస్ఏపీఈటీఏ) జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు ఎ.ప్రభాకర్ రెడ్డి, కుమార్, గౌరవ అధ్యక్షుడు దేవేందర్, ఎస్ఏపీఈటీఏలు రవీందర్, రాముడు, జన్ను బాబు, ప్రేం ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గసభ్యుడు మర్కాల యాదిరెడ్డి, వివిధ జిల్లాకు చెందిన ఎస్ఏపీఈటీలు, పీడీలు కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ పోటీలో తలపడుతున్న వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

అగ్రంపహాడ్ జాతరను ఘనంగా నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- జాతర ఏర్పాట్లపై సమీక్షలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రంపహాడ్‌ను మినీ మేడారంగా పిలిచే సమ్మక్క- సారలమ్మ జాతరను ఈసారి ఘనంగా నిర్వహించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఈ జాతర ఏర్పాట్లపై అధికారులతో గద్దెల వద్ద ఎమ్మెల్యే సమీక్షించారు. ముందుగా అమ్మవారి గద్దెల వద్ద వన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు ఆదేశాలు జారీ చేశారు. జాతరలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అమ్మవార్లను గద్దెలపైకి తీసుకొచ్చే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించాలని సూచించారు. తాగునీరు, క్లోరినేషన్, 108 వాహనం అందుబాటులో ఉంచడం, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. భక్తుల వాహనాలు పార్కింగ్ చేయడానికి స్థలం, చలువ పందిళ్లు, క్యూలు, భోజన సౌకర్యం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం తదితర అంశాలపై చర్చించారు. చేతి పంపులు, బోర్ల మరమ్మతు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, రోడ్లపక్కన చెట్లను తొలగించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి ఏర్పాటు, జాతర ప్రాంగణం, వాహనాల పార్కింగ్ స్థలం, అమ్మవార్ల గద్దెల చుట్టూ లైటింగ్, డెకరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఈ సమావేశంలో పరకాల ఆర్డీవో పి.నారాయణ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్.సునీత, జాతర ఈవో నాగేశ్వర్‌రావు, అన్ని శాఖల అధికారులతో పాటు ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బీరం సుందన సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, జాతర మాజీ చైర్మన్ బొరిగం స్వామి, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పోలీసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

ఖమ్మం రహదారిపై ఘటన

మామునూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. మంగళవారం సాయంత్రం వరంగల్ నాయుడు పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్‌కు చెందిన ఇమ్మనేని లక్ష్మణ్‌రావు (48) ఇటుక బట్టీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

మంగళవారం సమీప బంధువుల అంత్రక్రియలకు వెళ్ళి వచ్చిన ఆయన పెట్రోల్ బంక్ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతుండగా కాకినాడకు చెందిన 14 టైర్ల లారీ ఖమ్మం వైపు వెళ్తూ ఢీకొట్టింది. లారీ ముందుటైరు అతడిపై తలపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా ఎంజీఎంకు తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో లక్ష్మణ్‌రావు మృతదేహం

ఆలయాలను అభివృద్ధి చేయండి..

- చిల్పూర్, జీడికల్ గుళ్లకు రూ.10కోట్లు కేటాయించాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కడియం వినతి

హనుమకొండ, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని అతి ప్రాచీనమైన, చారిత్రకంగా సుప్రసిద్ధమైన దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ చేనేత భవన్‌లోని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయంలో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాల అభివృద్ధిపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఇతర అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అతి ప్రాచీనమైన, ప్రాముఖ్యత గల ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం పరిధిలోని చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.5కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆలయ ఆవరణలో ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ అర్చకుల నియామకానికి సంబంధించిన ఫైల్ పెండింగ్‌లో ఉందని, వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జీడికల్ రామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి సైతం రూ.5కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రతిపా దనలు సిద్ధం చేయాలని అన్నారు.వచ్చే నెల 4నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. నవాబ్‌పేట కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించిన రూ.1.03 కోట్ల అభివృద్ధి పనులను మంజూరు ఇవ్వాలని కోరారు. ఆలయ ఆవరణలో ప్రహరీ నిర్మాణంతో పాటు కోతుల బెడద అధికంగా ఉన్నందువల్ల సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే స్టేషన్‌ఘనపూర్ పట్టణ కేంద్రంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు తిరుమలనాథ స్వామి ఆలయానికి సంబంధించిన 1.09ఎకరాల దేవాదాయ శాఖ భూమి అన్యాక్రాంతం కాకుండా మున్సిపాలిటీకి లీజుకు అనుమతి ఇవ్వాలని కోరారు. మున్సిపాలి టీకి లీజుకు ఇవ్వడం ద్వారా ఆలయ భూమిని రక్షించడంతో పాటు ప్రజలకు ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని జీడికల్ రామ చంద్ర స్వామి ఆలయం, చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం, స్టేషన్ ఘనపూర్ తిరుమలనాథ స్వామి ఆలయం, చిన్నపెండ్యాల లక్ష్మినర్సింహస్వామి ఆలయాలకు చెందిన భూముల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం, ఆక్రమణలకు గురికాకుండా సర్వే చేసి హద్దులు నాటడంతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ రామక్రిష్ణారావు, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మెన్ పొట్లపల్లి శ్రీదర్ రావు, ఇతర దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకీ వినతి పత్రం అందజేస్తున్న కడియం

స్టడీ అవర్‌లో విద్యార్థినికి అస్వస్థత

వెంకట్రాంపురం ఉన్నత పాఠశాల్లో ఘటన

బయ్యారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుడు చదవమని వారించగా.. స్టడీ అవర్‌లో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైన ఘటన మానుకోట జిల్లా బయ్యారం మండలంలోని వెంకట్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాల నందు చోక్లాతండాకు చెందిన సంగీత అనే విద్యార్థిని 8వ తరగతి చదువుతోంది. ఎస్ఏ-1 పరీక్షల ప్రిపరేషన్‌లో భాగంగా పాఠశాలలో మధ్యాహ్నా సమయంలో నిర్వహించిన స్టడీ అవర్‌లో సదరు విద్యార్థిని అస్వస్థతకు గురైంది. దీంతో విద్యార్థినిని చికిత్స నిమిత్తం బయ్యారంలోని ఓ ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు సమాచారం.

అనంతరం విషయాన్ని తల్లిదండ్రులకు తెలపగా వారు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం లింగరాజును వివరణ కోరగా.. స్టడీ అవర్‌లో తెలుగు ఉపాధ్యాయుడు చదవమని అనడంతో విద్యార్థిని అస్వస్థతకు గురైందన్నారు. తొలుత బయ్యారంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.



ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తనపై విచారణ చేస్తున్న ఎంఈవో వెంకటేశ్వరరావు

ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిపై విచారణ

- పాఠశాల నుంచి తొలగింపు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తనపై ఎంఈవో మంగళవారం విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యన భ్యసిస్తున్న ఓవిద్యారినిపై పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ఈనెల 25న అసభ్యకరంగా ప్రవర్తించాడనే విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. 26న ఆదివారం కావడంతో ఈ నెల 27న పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న డీఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలకు చేరుకొని మంగళవారం సంబంధిత జిల్లా, ఎంఈవోకు తెలిపి నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎంఈవో వెంకటేశ్వర రావును వివరణ కోరగా విచారణ చేపట్టి పూర్తి నివేదికను డీఈవోకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం



అదృశ్యమైన తల్లి సెహరూర్, కుమార్తె

గీసుగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : 15వ డివిజన్ మొగిలిచర్లలో తల్లి, కూతుళ్ల అదృశ్యమైన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొగిలిచర్ల గ్రామంలో సెహరూన్ (31) ఆమె కూమార్తెలు సహిస్తా (9), సానియా (6)లు ఈ నెల 27 ఇంటి నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయారని సెహరూన్ భర్త షాహిద్‌ఖాన్ ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. కాగా, ఈ నెల 27న బొడ్డుచింతలపల్లిలో ఉమసత్యదుర్గ అనే వివాహిత, గొర్రెకుంటలో బీటెక్ విద్యార్థిని శాతరాసి శ్యామలత అదృశ్యమైనట్లు వారి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా గత మూడు నెలల్లో 10 మంది వరకు అదృశ్యమైన కేసులు నమోదు కావటం గమనార్హం.

పోలీస్ అమరుల సేవలు చిరస్మరణీయం



మానుకోటలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

బయ్యారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంఘవిద్రోహ శక్తుల నుంచి శాంతి భద్రలను పరిరక్షించేలా విధినిర్వహణలో అమరులైన పోలీసులు అందించిన సేవలు చిరస్మరణీయమని బయ్యారం సీఐ రవి కుమార్ తెలిపారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బయ్యారంలో పోలీసులు విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి గాంధీ సెంటర్ బయ్యారం పీహెచ్‌సీ మీదిగా రామాలయం సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో పోలీస్ పాత్ర కీలకమన్నారు. బయ్యారం సర్కిల్ ఆధ్వర్యంలో బయ్యారం, గార్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సైలు తిరుపతి, మహబూబ్‌తో పాటు ఏఎస్సై క్రిష్ణమూర్తి సిబ్బంది తిర్మల్‌రావు, పాపారావు, స్వరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, పాష, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ క్రైం : పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ టౌన్ సీఐ జి మహేందర్‌రెడ్డి, రూరల్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు మానుకోట పట్టణంలో మంగళవారం సైకిల్ ర్యాలీ అనంతరం కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించి పోలీసు అమరవీరులకు నివాళి అర్పించారు. ఎస్సైలు గండ్రాతి సతీష్, ప్రశాంత్, దీపికరెడ్డి పాల్గొన్నారు.

● డోర్నకల్ : సమాజంలో జరిగే నేరాలను అరికట్టడానికి పోలీసులకు ప్రజలు సహకరించాలని డోర్నకల్ సీఐ చంద్రమౌళి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డోర్నకల్‌లో విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు వంశీధర్, గడ్డం ఉమ తదితరులు పాల్గొన్నారు.



బయ్యారంలో పోలీసుల సైకిల్ ర్యాలీ



డోర్నకల్‌లో సైకిల్ ర్యాలీ

పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యం

- జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న రడం రాజేష్ గ్రూప్-2కు ఎంపిక కావడంతో ఎస్పీని మంగళవారం మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని కురవి మండలం మోదుగులగూడెం గ్రామానికి చెందిన జి రాజేష్ ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగుతూనే ఉన్నత స్థాయి ఉద్యోగానికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకేరు పరీవాహక ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

కురవి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో భారీ వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ఆకేరువాగు పరీవాహక ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీరోలు తహసీల్దార్ పున్నం చందర్ సూచించారు. సీరోలు మండలం మన్నెగూడెం రెవెన్యూ గ్రామ పరిధిలోని మోదుగడ్డతండ, దుబ్బతండ, ఆకేరువాగు పరివాహక ప్రాంతాన్ని మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. గత సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలకు ఆకేరువాగు పొంగడం వల్ల తండా పూర్తిగా మునిగిపోయిందన్నారు. ప్రస్తుత తుఫాన్ దృష్ట్యా తండవాసులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చంద్రయ్య, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రిస్క్ టీం సభ్యులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 3న గూడూరు మండల కేంద్రంలో జరిగే రాసూరి యాకన్న, చిన్నం కోటి స్మారక బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నాయకులు కొట్టెం అచ్చన్న పిలుపునిచ్చారు. గూడూరు ఎన్డీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి కోసం.. భుక్తి కోసం.. దేశ విముక్తి కోసం సాయుధ పోరాటమే మార్గమని భావించి అసువులు బాసిన అమరవీరులకు నవంబర్ 1 నుంచి 9 వరకు స్మారక బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 3న గూడూరులో జరిగే సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొట్టెం వజ్జన్న, అడ్డూరి వెంకన్న, తిరుపతక్క, సమ్మయ్య పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

డోర్నకల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బోడేపుడి కిరణ్‌కుమార్ అన్నారు. డోర్నకల్ మండలంలోని తెల్లబండతండాలో మంగళవారం డోర్నకల్ పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు సమక్షంలో పశువైద్య శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. పశువుల సంరక్షణ పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సీజనల్ వారీగా వస్తున్న వ్యాధుల గురించి అవగాహన కలిగి ఉండి వాటి నివారణకు టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చందర్, సులెమాన్, అశోక్ పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రజారోగ్యాలను కాపాడాలి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య సమస్యను పరిష్కరించి ప్రజారోగ్యాలను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గునిగంటి రాజన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవనంలో సీపీఎం మహబూబాబాద్ రూరల్ మండల కమిటీ సమావేశాన్ని వెలిశాల సుధాకర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన గునిగంటి రాజన్న మాట్లాడుతూ...గ్రామాల్లో పంచాయతీలకు పాలకమండళ్లు లేక పట్టించుకునే వారే కరువయ్యారని, పల్లెల్లో పారిశుధ్య సమస్య తీవ్రతరమైందని తద్వారా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదముందన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, చేపూరి గణేష్, ఇస్లావత్ జోగ్యానాయక్, నర్సింహారావు, గోవర్ధన్‌పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పిడిన నిందితులను శిక్షించాలి..

బయ్యారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకుడు నాయిని శ్రీనివాస్ రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను చట్ట ప్రకారం శిక్షించేలా పోలీసులు చర్యలు చేపట్టాలని ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తనపై గత నెల 21న జరిగిన హత్యాప్రయత్నానికి సంబంధించిన నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బయ్యారంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ రెడ్డి చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ దీక్షకు ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పార్టీ కోసం పనిచేసిన వారికి కాకుండా పార్టీ పిరాయించిన వారికి కాంగ్రెస్‌లో ప్రాధాన్యతనివ్వడం కార్యకర్తలను నిరుత్సాహానికి గురిచేస్తుందన్నారు. స్వపక్ష నేతలే సాటి నాయకుడిపై హత్యాయత్నానికి పాల్పడం విచారకరమన్నారు. దీనిపై పార్టీ హైకామండ్ దృష్టి సారించి తోటి కాంగ్రెస్ నాయకుడిపై దాడి చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా ఈ దీక్షకు మద్దతుగా చల్లా గోవర్ధన్ కూడా ఆయన వెంట కూర్చున్నారు. ఇదిలా ఉండగా అధికార పార్టీకి చెందిన నాయకుడే దీక్షకు పూనుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఎంజీఎంకు కొత్త బాస్

(5వ పేజీ తరువాయి)

నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఈఎన్‌టీ విభాగం ప్రొఫెసర్‌గా సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. హరీష్ చంద్రారెడ్డి శుక్రవారం ఎంజీఎంలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కాగా, ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ కిశోర్‌ను పదవి నుంచి ప్రభుత్వం తొలగించడం చర్చనీయాంశంగా మారింది. కొన్నిరోజులుగా ఎంజీఎంలో జరుగుతున్న వరుస సంఘటనలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ సీరియస్ కావడంతో వేటు పడినట్లు చెబుతున్నారు. నిర్వహణ లోపాలు, పరిపాలన వైఫల్యాలు, రోగులకు సరైన వైద్యసేవలు అందకపోవడం, వైద్యులు సమయపాలన పాటించకపోవడం తదితర అంశాలు డాక్టర్ కిశోర్‌ను తొలగించేందుకు కారణాలుగా నిలిచాయని చెబుతున్నారు. నూతన సూపరింటెండెంట్ అయినా ఎంజీఎం పాలనను గాడిలో పెట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేదలకు న్యాయం చేయడమే ప్రజా పాలన లక్ష్యం

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదురుగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలను కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం గత నాల్గు దశాబ్దాలుగా కొనసాగుతున్న రాంపురం గ్రామానికి రహదారి సమస్యపై రూపకల్పన గావించిన వంతెన నిర్మానానికి తెలంగాణ ప్రభుత్వ రూ20 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ ప్రదేశాన్ని అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శారద. ఎంపీడీవో మంగమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కట్టా శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ మాలోత్ వెకట్‌లాల్ నాయక్, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీ లక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, గుండా వెంకట్‌రెడ్డి, హతిరాం నాయక్, లింగాల నాగేశ్వరావు, మన్నెపల్లి వెంకయ్య, భూక్యా రాం కుమార్ నాయక్, బాబు లాల్ నాయక్, యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



పాకాల ఏటిపై వంతెన నిర్మించే ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని నవంబరు 1 నుంచి 25 వరకు కేంద్ర ప్రభుత్వం జరుపతలపెట్టిన ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ ఐక్యత కోసం పోరాటాలు చేసిన గొప్ప నాయకుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని కొనియాడారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో 10 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించిన విద్యార్థలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందించన్నుట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకటి మహేష్‌గౌడ్, గడ్డం అశోక్, మదన్, సింగారపు సతీష్, దారా ఇందుభారతి, ఓర్సు పద్మావతి, మంగమ్మ, కిషన్, జహేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వద్దిరాజు రాంచందర్‌రావు

చలో ఏటూరునాగారాన్ని జయప్రదం చేయాలి



మట్టేవాడలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నవంబర్ 3న జరిగే చలో ఏటూరునాగారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు తాటి సుధాకర్ పిలుపునిచ్చారు. గూడూరు మండలంలోని పలు గ్రామాలను తెలంగాణ ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. ఏటూరు నాగారం వై జంక్షన్ నుంచి ఐటీడీఏ ఎదుట నిర్వహించే మహా ధర్నా కార్యక్రమానికి ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నాయకులు దారం సాంబరాజు, పూనెం జనార్ధన్, సోలం సాగర్, దారం నరేష్, రేగ వెంకటేశ్వర్లు, కొట్టెం సమ్మయ్య, లింగాల బుచ్చిరాములు, వాసం వీరస్వామి పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా పని చేస్తున్న డోలి సంధ్య గ్రూప్-2 ఫలితాల్లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికై ఖమ్మంకు జిల్లాకు వెళ్తున్న ఆమెను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ టి.రాజేశ్వర్ మాట్లాడుతూ... ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రతి ఉద్యోగి కాలనుగుణంగా మార్పు చెంది ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీధర్, సాయిరాం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



డోలి సంధ్యను సన్మానిస్తున్న కమిషనర్ టి. రాజేశ్వర్

తైక్వాండో పోటీలకు హర్షిత్ ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :నాగాలాండ్ రాజధాని కోహిమాలో ఈ నెల 29 నుంచి 31 వరకు జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థి హర్షిత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు నసీరుద్దీన్ తెలిపారు. మహబూబాబాద్‌లోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థి హర్షిత్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14లో 23 కిలోల విభాగంలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించిన హర్షిత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. హర్షిత్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి, ఎస్జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీ పీఈటీ అసోసియేషన్ బాధ్యులు శంకర్, ఐలయ్య, కోచ్ రాంబాబు హర్షం వ్యక్తం చేశారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

సంక్షేమ బోర్డులేక నష్టపోతున్న హమాలీలు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్

కేసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల తరహాలో హమాలీలకు సంక్షేమ బోర్డు లేకపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఇఫ్టూ అనుబంధ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్ అన్నారు. కేసముద్రం మార్కెట్ ఆవరణలో మంగళవారం ఆ యూనియన్ శాఖ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం బస్తాల బరువులు మోసే హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం కేసముద్రం శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బండి రాజు, గౌరవ అధ్యక్షునిగా మిట్టగడుపుల వెంకన్న, ఉపాధ్యక్షులుగా గుగులోత్ లాలు, ప్రధాన కార్యదర్శిగా బండారి వెంకన్న, సహాయ కార్యదర్శిగా మేకల రాజు, కోశాధికారిగా అంగోతు నరేష్‌లను ఎన్నుకున్నారు. కాసు సూరయ్య, సిట్ల సంజీవ, భూక్య బిచ్యా, నూనావత్ బాలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెనుశాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) సహా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. మహబూబాబాద్ లయన్స్ క్లబ్ భవనంలో సోమవారం రాత్రి జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన భిక్షంగౌడ్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేయకపోతే సెప్టెంబరు 1న హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో జరిగిన ఉద్యమం కంటే సంఘం ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిర్యాల సతీష్‌రెడ్డి, చాగర్లముడి శ్రీధర్, ఏఐఎఫ్‌టీవో జాతీయ ఉపాధ్యక్షురాలు గీత, నాయకులు కల్లెం వెంకట్ రెడ్డి, హాల్యానాయక్, కనకయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, శేషుకుమార్, వెంకటయ్య, సీతారాములు, వినోద్‌కుమార్, రమేష్, సంకా బద్రినారాయణ, 18 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నేత సుంకురి భిక్షం

డేటా ఎంట్రీ బిల్లులను విడుదల చేయాలి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎన్యుమరేటర్ల ద్వారా రాష్ట్ర ప్రజల వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే వివరాలు సేకరించిన దరఖాస్తులను జిల్లా కేంద్రంలో నిరుద్యోగ యువతతో డేటా ఎంట్రీ చేయించి సంవత్సరం గడుస్తున్న నేటికి వారికి బిల్లులు చెల్లించలేదని వాపోయారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ఒక్క దరఖాస్తుకు రూ.30 చొప్పున చెల్లిస్తామని ఇప్పటికి డబ్బులు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణమే అధికారులు స్పందించి ఆపరేటర్లకు బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

'వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

నెల్లికుదురు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇసంపెల్లి సైదులు తెలిపారు. మండలంలోని మునిగలవీడు గ్రామంలో మంగళవారం వ్యవసాయ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికలకు పించన్‌లు ఇస్తామనిచెప్పి మోసం చేశారన్నారు. కూలిబంధు కింద రూ 1200 ఇవ్వాలన్నారు.మండల రెవెన్యూ అధికారులు, లేబర్ అధికారులు గ్రామాలలో పర్యటించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. భూక్య భిక్షపతి, బండ వెంకన్న, శ్యామల మల్లయ్య, వెంకటయ్య, కిష్టయ్య, బీలు ఎల్లయ్య పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని గూడూరు మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ మాలిక్ అన్నారు. గూడూరులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు తాత్కాలికంగా వరికోత పనులను వాయిదా వేసుకోవాలని సూచించారు. ధాన్యం నాణ్యతను కాపాడుకోవాలని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాతనే కోత పనులు పెట్టుకోవాలని సూచించారు.

కోర్టుకు హాజరు కాని వ్యక్తికి రిమాండ్

డోర్నకల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కోర్టు వాయిదాలకు హాజరుకానీ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డోర్నకల్ సీఐ చంద్రమౌళి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు గ్రామానికి చెందిన లకావత్ రాంబాబుపై 2018లో డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడు కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో సమన్లు జారీ చేసింది. వీటిని కూడ భేఖతర్ చేయడంతో నిందితునిపై నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేశారు. దీంతో మంగళవారం లకావత్ రాంబాబును అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : 2025-26 ఆర్థిక సంవత్సరానికి మహబూబాబాద్ జిల్లాకు సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ పథకం కింద సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బ్యాటరీ స్ప్రెయర్లు 2496, పవర్ స్ప్రెయర్లు 452, రోటోవేటర్లు 178, సీడ్ కం ఫర్టిడ్రిల్స్ 36, కేజీవీల్స్ కల్టివేటర్స్ 222, బండ్ ఫార్మర్స్ 9, పవర్ వీడర్స్ 17, బ్రష్ కటర్స్ 33, పవర్ టిల్లర్స్ 25, బేలర్స్ 29 అందుబాటులో ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ మహిళ రైతులకు 50 శాతం రాయితీ, మిగతా రైతులకు 40 శాతం రాయితీతో పనిముట్లు అందించడం జరుగుతుందన్నారు. రైతులు పట్టాదారుపాస్‌పుస్తకం, ట్రాక్టర్ ఆర్‌సీతో పాటు దరఖాస్తు ఫాం నింపి వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

గార్ల ఎస్సైగా సాయి కుమార్

గార్ల అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా సాయికుమార్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతకు ముందు గార్లలో విధులు నిర్వహించిన ఎస్‌కే రియాజ్ పాషా జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పనిచేసిన సాయికుమార్‌ను గార్లకు బదిలీ కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ పదవీ బాధ్యతలు చేపట్టారు.



సాయికుమార్

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ జిల్లాలో ఈ నెల 30న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భాసపాక పవన్, గుండ్ల రాకేష్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ, బీఈడీ, పీజీ ప్రభుత్వ యూనివర్సిటీల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో వంశీ, తాజ్, శివ, వినయ్, ప్రవీణ్, యాకన్న పాల్గొన్నారు.

● కేసముద్రం: విద్యార్థుల ఉపకార వేతనాల బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్‌తో ఈనెల 30న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు పిలుపునిచ్చారు. కేసముద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.8150కోట్ల వరకు ఉపకారవేతనాల బకాయిలు ఉన్నాయని, వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బాణ సింహాద్రి, విష్ణు, మహేష్, వినయ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు సైబర్ నేరాలతో పాటు మత్తు పదార్థాలు, మహిళలపై జరిగే దాడుల పట్ల అవగాహన కలిగి ఉండాలని డోర్నకల్ సీఐ చంద్రమౌళి అన్నారు. మంగళవారం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని కస్తూర్బాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, మత్తుపదార్థాలు, మానవ అక్రమ రవాణ, వివిధ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై ఉమ, కేజీబీవీ ప్రిన్సిపాల్ మున్ని, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై వివరిస్తున్న సీఐ